# గొప్ప ఉద్దేశము

## (ఎఫెసీ పత్రిక - సంగ్రహ సమీక్ష)

### I. ఎఫెసీ పత్రిక రచనా వివరాలు :

| | | |
|---|---|---|
| గ్రంథకర్త | : | అపొస్తలుడైన పౌలు. |
| పాఠకులు | : | ఎఫెసులో ఉన్న సంఘము, క్రీస్తు యేసునందున్న విశ్వాసులు. |
| కాలము | : | క్రీ॥ శ॥ 60 సం॥ |
| స్థలము | : | రోమా నగరంలో (జైలులో నిర్భందించబడిన సమయంలో). |
| ఉద్దేశము | : | క్రీస్తు శరీరమైన "సంఘం" యొక్క స్వభావం, దాని ఉద్దేశం, ఎఫెసులో ఉన్న విశ్వాసులకు వివరించి వారిని విశ్వాసంలో బలపరచేందుకు. |

### II. ఎఫెసీ పత్రిక ప్రత్యేక వివరాలు :

ఎ. **ఎఫెసీ ప్రాంత పరిచయం :** ఎఫెసు పట్టణం క్రీ॥ పూ॥ 2000 సం॥ల క్రితం హిత్తీయులు అనే జాతి ప్రజల ద్వారా కనుగొనబడింది. ఈ ఎఫెసు పట్టణం మధ్యధరా సముద్రానికి ఉత్తరభాగంలో చిన్న ఆసియాకు పశ్చిమ దిశగా ఆగ్నేయ సముద్రపు ఒడ్డున నిలయమై ఉండేది. అది సుప్రసిద్ధమైన ఓడరేవు పట్టణం కావడం వలన ఆర్థికంగా ఎంతో ఉన్నత స్థానాన్ని అధిరోహించింది. రోమా ప్రభుత్వ కాలంలో ఆసియాకు రాజధానిగా గొప్ప స్థానాన్ని పొందుకున్నది. ఇక సాంస్కృతికపరంగా దరిదాపు 25 వేల మంది ఒకేసారి తిలకించగల ఒక మెగా థియేటర్ నిర్మించబడి ఉండటం ఒక విశేషం. ఇక ఆధ్యాత్మిక పరంగా అలనాటి ప్రాచీన ప్రపంచ వింతల్లో ఒకటిగా పేరొందింది అర్తెమి దేవాలయం. ఇది అంతకు ముందెన్నడు నిర్మించబడనంత పెద్దదైన (418 అడుగులు పొడవు 239 అడుగుల వెడల్పు కలిగిన) గ్రీకుల దేవాలయం. అర్తెమి దేవత విగ్రహం సరాసరి ఆకాశం నుండి రాలి అక్కడ పడిందని వారి నమ్మకం. రోమా ప్రభుత్వ కాలంలో ఈ అర్తెమి దేవిని అందరికీ పరిచయం చేయాలనే ఉద్దేశంతో "ఎఫెసు యొక్క డయానా (అర్తెమి) అని నాణెములపై ముద్రించారు. అర్తెమి ఆలయమంతా ఎంతో అందంగా తీర్చి దిద్ది లోపట అనేక పాలిండ్లు కలిగిన అర్తెమి అశ్లీల (డయానా) విగ్రహాన్ని రూపుదిద్దారు. అర్తెమి "ఫలదీకరణ దేవత" అని ఆనాటి యువతులు బహుగా నమ్మి, అందుకోసమై ఆయా పూజలు చేసేవారు. ఆ వంకతో ఆదేవత పేరున జరిగే ఉత్సవాల్లో, ఆలయనీడలో అనైతిక, లైంగిక కార్యక్రమాలు జరిగిస్తూ ఉండేవారు. ఇక ఎఫెసులో యధేచ్ఛగా జరుగుతున్న మరొక వ్యాపారం అర్తెమి దేవి ఆలయ వెండి నమూనాలు చేయించి అమ్మడం. ఆ ప్రాచీన కాలం నాటి ప్రపంచ అద్భుతాల్లో ఈ ఆలయం ఒకటిగా పేరు గాంచడంతో ఈ ఆలయ వెండి నమూనాలు విరివిగా

అమ్ముడుపోతూ ఉండేవి. ఇదే అదనుగా అర్చకులు, అర్చకేతరులు సహితం ధనార్జన చేస్తూ ఉండేవారు.

ఇటువంటి ఎఫెసు పట్టణంలో అటువంటి పరిస్థితుల్లో అపొ. పౌలు క్రీ॥ శ॥ 52లో సువార్త నిమిత్తం సాహసించి అడుగు పెట్టాడు. నిజానికి క్రీ॥ శ॥ 50లో అకుల, ప్రిస్కిల్ల గృహం ఆధారంగా (అపొ.కా.18:18) ఎఫెసులో క్రైస్తవ్యానికి అంకురార్పణ జరిగింది. అపొ. పౌలు మొదట వీరి గృహం నుండే ఆ ప్రాంతమంతటా గృహ పరిచర్యలు ఆరంభించాడు. ఆ తరువాత సమాజమందిరమునకు వెళ్ళాడు. అపొ. పౌలు ఇక్కడ దరిదాపు 3 మాసాలు దేవుని రాజ్యం గురించి బహుధైర్యంగా మాట్లాడుతూ అనేక సత్యాలు వారికి విశదపరస్తూ వచ్చాడు. ఆ తరువాత 'తురన్ను' అనే పాఠశాలలో 2 సం॥లు ఉండి ఆసియాలో ఉన్న యూదులకు, గ్రీకులకందరికీ బోధిస్తూవచ్చాడు. పౌలు ఎఫెసులో సువార్త కొరకు ఉన్నట్లు తన మిషెనరీ యాత్రల్లో ఎక్కడా అంతకాలం ఉండలేదు. ఆ కారణాన్న ఎన్నో లోతైన సత్యాలు ఎఫెసీయులకు వ్రాస్తూ ఉన్నాడు. అపొ.కా. 19:10 ప్రకారం ఈ పట్టణం ఆధారంగా ఆసియాలో ఉన్నవారంతా ప్రభువైన యేసు గురించి విని తెలుసుకున్నట్లు చూడగలం. అలా క్రీ॥ శ॥ 53 సం॥లో పౌలు ఎఫెసులో ఒక సంఘాన్ని స్థాపించడం జరిగింది.

## III. ఎఫెసీ పత్రిక విభజన :

ఎఫెసీ పత్రిక అంతటిని క్రోడీకరిస్తే... "దేవుని గొప్ప ఉద్దేశము" అనేది ఈ పత్రికలో ప్రస్ఫుటం అవుతుంది. జీవము గల దేవుని సంఘం పట్ల ఆయనకు ఉన్న ఉద్దేశాన్ని అపొ. పౌలు ఆయా పోలికలలో విడమరచి చెప్పాడు. ఇక ఈ పత్రికను 2 భాగాలుగా విభజించ వచ్చును.

| **మొదటి విభాగం-సిద్ధాంతపరము (1-3 అధ్యా)** | **రెండవ విభాగం-ఆచరణాత్మకము(4-6 అధ్యా)** |
|---|---|
| 1. క్రీస్తులో స్థానము | 1. క్రీస్తు శరీరములో ఐక్యత |
| 2. క్రీస్తులో ఐక్యత | 2. క్రైస్తవుని అభ్యాసము |
| 3. సంఘము యొక్క పరలోక పిలుపు | 3. సంఘము యొక్క ఇహలోక నడత |

ఇక ఈ రెండు భాగాల్లో మూడేసి ఉపభాగాలున్నాయి.

### 1. మొదటి భాగం-సిద్ధాంత పరమైన విషయాలు (1-3 అధ్యా) :

### ఎ) సంఘము ఒక శరీరము (1 అధ్యా) :

**తండ్రియైన దేవుని ప్రణాళిక (ఎఫెసీ. 1:3-6వ) :** దేవుడు మన కొరకు ఆత్మ సంబంధమైన ఆశీర్వాదాలను సిద్ధపరచి యేసుక్రీస్తులో దాచివుంచాడు. పరలోకంలో దాచబడిన ఈ ఆశీర్వాదాలను భూలోకంలో మనం అనుభవించడానికి ఆయన జగత్తు పునాదికి ముందే ఒక చక్కని ప్రణాళిక చేశాడు. మనలను తన కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా రక్షించి, తన కుమారులుగా స్వీకరించాలని, మరియు ఆయన ఎదుట పరిశుద్ధులనుగా, నిర్దోషులనుగా

నిలువబెట్టావాలన్నదే ఆ ప్రణాళిక ఉద్దేశం. దేవుని ఏర్పాటు, మనల్ని పరిశుద్ధంగా ఉండాలని కోరుతున్నది. ఆ ఏర్పాటులోనికి వచ్చిన వారి జీవితంలో తప్పనిసరిగా అలాంటి మార్పు కలుగుతుంది. (2 కొరింథీ. 5:17).

**కుమారుడైన దేవుని ప్రయాస (ఎఫెసీ. 1:7-12) :** తండ్రియైన దేవుని ప్రణాళికను అమలు పర్చడానికి కుమారుడైన యేసుక్రీస్తు క్రయధనము చెల్లించాడు. ఆయన రక్తము వలన మనకు విమోచన అనగా మన అపరాధములకు క్షమాపణ లభిస్తుంది. "విమోచన" అనే పదమునకు 3 గ్రీకు పదాలు క్రొత్తనిబంధనలో ఉపయోగించబడ్డాయి. ఎగొరాజో(Agorazo) అన్నమాటకు అర్థం, 'బజారులోకొనుట' – పౌలు 1 కొరింథీ, 6:20 లో సరిగ్గా ఈ అర్థాన్నిచ్చే పదాన్నే అనగా 'ఎగొరాజో' అనే పదాన్ని ఉపయోగించాడు. గ్రీకు భాషలోని మరో పదము "ఎగ్జాగొరాజో" (Exagorazo) దాని అర్థం, ఒక వస్తువును తిరిగి అమ్మడానికి కాక స్వంత ఉపయోగార్థం కొనుట (గలతీ 3:13). అనగా క్రీస్తు మనల్ని తన కొరకు జీవించడానికే కొన్నాడు. విమోచన అనే పదమునకు వాడబడిన మరో గ్రీకు పదము 'అపోల్యుట్రొసిన్" (Apolutrosis). ఈ మాటనే ఎఫెసీ 1:7లో వాడబడింది. దీని అర్థమేమిటంటే ఒక వ్యక్తి స్వేచ్ఛగా జీవించడానికి క్రయము చెల్లించి స్వతంత్రునిగా చేయుట. ఇదే మాటను యేసుక్రీస్తు లూకా సువార్త 21:28లో ఉపయోగించాడు. "మీరు ధైర్యము తెచ్చుకొని మీ తలలెత్తికొనుడి, మీ విడుదల సమీపించుచున్నది".

పాపపు దాస్యంలో ఉన్న మానవునికి యేసుక్రీస్తు ద్వారా స్వాతంత్ర్యం లభించింది (యోహాను 8:36). పాపం నుండి విమోచించబడిన మానవుడు కృతజ్ఞతతో తనకు స్వాతంత్ర్యాన్ని ఇచ్చిన వానికి స్వచ్ఛందంగా దాసుడు అవుతాడు.

ఇక క్షమాపణ అన్నది నీతి, న్యాయం, పరిశుద్ధతలకు వేరుగా నున్న దైవ లక్షణం కాదు. క్షమాపణ రక్తప్రోక్షణపై ఆధారపడి ఉన్నది. పాపమునకు ప్రాయశ్చిత్తం కోరుతున్నది. యేసుక్రీస్తు తన రక్తాన్ని చిందించడం వలన క్షమాపణకు పునాది వేశాడు, లేనట్లైతే మానవుని పాపానికి క్షమాపణ లేదు.

**పరిశుద్ధాత్మ సంరక్షణ (ఎఫెసీ. 1:13)** :యేసుక్రీస్తునందు విశ్వాసముంచిన వారిలో పరిశుద్ధాత్మ చేసే పని, తండ్రియైన దేవుడు మరియు కుమారుడైన దేవుడు చేసిన పనికి వేరుగా ఉన్నది. తండ్రి, కుమారుడు మన కోసం కార్యం చేసారు. పరిశుద్ధాత్మ మనలో తన కార్యం చేస్తాడు.

**మొదటిది :** పరిశుద్ధాత్మ మనల్ని తిరిగి జన్మింపజేస్తాడు. ఒక వ్యక్తి తిరిగి జన్మించాలంటే దేవునియందు విశ్వాసముంచాలి (యోహాను 1:12). దేవునియందలి విశ్వాసం వాక్యం వినడం ద్వారానే కలుగుతుంది. మనం సత్యవాక్యాల్ని అనగా రక్షణ సువార్తను విన్నప్పుడు, పరిశుద్ధాత్మ మనలో విశ్వాసాన్ని కలుగజేస్తాడు (1 పేతురు 1:23; రోమా 10:17) మరియు పాపమును గూర్చి ఒప్పింపజేస్తాడు (యోహాను 16:8). **రెండవది :** ఒక వ్యక్తి

తిరిగి జన్మించినప్పుడు పరిశుద్ధాత్మ ఆ విశ్వాసిని ముద్రిస్తాడు. మరో విధంగా చెప్పాలంటే ఆయనే ఆ ముద్ర. పరిశుద్ధాత్మచేత ముద్రించబడుటలో రెండు ఉద్దేశాలున్నాయి. సాధారణంగా ముద్రపై ఏదో ఒక రూపం ఉంటుంది. అలాగే దేవుని ఆత్మ విశ్వాసిలో దేవుని రూపాన్ని ముద్రిస్తాడు (యోహాను 3:33). ముద్ర అధికార పూర్వకమైన యాజమాన్యానికి గుర్తుగా కూడా ఉన్నది. రక్షించబడిన వారందరూ దేవునికి చెందినవారు. ఆయన వారిని ఎరుగును (2 తిమో 2:19).

పరిశుద్ధాత్మ చేసే **మూడవ పని**, సంఘమును సంరక్షించుట (ఎఫెసీ. 1:14). సంచకరువు అంటే, ఒక ఆస్తిని కొనేముందు ఇచ్చే బయానా, అనగా కొంత డబ్బును బయానాగా పొందాము అంటే, వాగ్దానం చేయబడిన మిగతా డబ్బును కూడా పొందుతామని అర్థం. పరిశుద్ధాత్మ మన సంచకరువు (బయానా)గా ఉండి మనం ఆశీర్వాదాలన్నీ పొందేంతవరకు సంరక్షిస్తాడు.

**బి) సంఘము ఒక దేవాలయము (2 అధ్యా) :**

**దేవాలయ నిర్మాణ సామాగ్రి (2:1-10) :** పాత నిబంధనలో సంఘము మందిరమునకు లేక ప్రత్యక్ష గుడారమునకు సంబంధించినదిగా ఉన్నది. ఈ రెండింటికి వ్యత్యాసమున్నది. ప్రత్యక్ష గుడారం ఎండిపోయిన (చచ్చిన) కర్రతో చేయబడింది. అయితే క్రొత్త నిబంధనలో దేవుడు సంఘమును నిర్మించడానికి అపరాధములచేత పాపముచేత చచ్చిన వారిని తీసుకొని జీవముగల మందిరముగా మార్చాడు (ఎఫెసీ. 2:1-5). ప్రత్యక్ష గుడారము మరియు మందిరము దేవుని మహిమ నివసించే స్థలాలు. అయితే సంఘములో పరిశుద్ధాత్మ ఒక వ్యక్తిగా నివసిస్తున్నాడు. ప్రత్యక్ష గుడారం లేక మందిరము, ఆచార కర్మకాండలు జరిగించే స్థలం, మళ్ళీ, మళ్ళీ బలులు అర్పించే స్థలం. కాని సంఘము క్రీస్తు ఒకే బలి ద్వారా నిర్మించబడింది. ఈ బలియాగం మళ్ళీ, మళ్ళీ అర్పించబడదు (హెబ్రీ. 9:25,26). సంఘంలో ఆచార కర్మకాండలు లేవు. సజీవమైన రాళ్ళలో పరిశుద్ధాత్మ కదలిక ద్వారా పనిచేసే సజీవ నిర్మాణమే సంఘము.

**దేవాలయ నిర్మాణ విధానం (2:11-18) :** ఎఫెసు సంఘంలో యూదులకన్న అన్యులే ఎక్కువగా ఉండేవారు. అబ్రాహాము కాలము నుండి పరిశుద్ధాత్మ (పెంతెకొస్తు దినాన) ఈ లోకానికి పంపించబడేంత వరకు కూడ యూదులు అన్యుల కంటె ప్రత్యేకమైనవారుగా ఎంచబడ్డారు. అయితే కాలక్రమేణ ఇది ఇశ్రాయేలీయులు అతిశయించడానికి కారణమైంది. అలా ఇరువురి మధ్య ద్వేషభావం పెరిగిపోయింది. కనుక పౌలు ఆ భావాన్ని తొలగించడానికి అన్యులను దేవుడు క్రీస్తునందు తనకు సమీపస్తులుగా చేసుకొన్నాడని తనతో సమాధానపరచు కొన్నాడని వ్రాసాడు (ఎఫెసీ. 2:11-14). పాతనిబంధన కాలంలో దేవాలయంలో యూదులకు అన్యులకు వేరు వేరు ఆవరణాలు ఉండేవి. యేసుక్రీస్తు యూదులకు అన్యులకు మధ్య ఉన్న గోడను పగులగొట్టి ఉభయులను ఏకం చేసాడు. ఆయన తన సిలువ కార్యం

ద్వారా మానవులను దేవునితో సమాధాన పర్చడమే కాక, తనయందు విశ్వాసముంచిన వారిని నూతన వ్యక్తులుగా మారుస్తాడు (15వ). సంఘము ఒక నూతన పురుషుడు.

**దేవాలయ నిర్మాణ భావం (2:19-22) :** అన్యజనుల స్థితిలో క్రీస్తునుబట్టి మార్పువచ్చింది. “మీరు ఇక మీదట పరజనులును, పరదేశులునైయుండక, పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని యింటివారునై యున్నారు.” (ఎఫెసీ 2:19) అని పౌలు వ్రాస్తున్నాడు. ఇప్పుడు యూదులు మరియు అన్యులు ఒకే కుటుంబానికి చెందినవారు. వారి పౌరసత్వం పరలోకానికి సంబంధించినది (ఫిలిప్పీ. 3:20). మనమంతా ఏక పట్టణస్థులం. ఈ సంఘము అపొస్తలులు మరియు ప్రవక్తలు వేసిన పునాదిపై అనగా వారి సిద్ధాంతముపై కట్టబడింది (అపొ. 2:42). యేసుక్రీస్తు సంఘానికి మూలరాయి. ఈ కట్టడము ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయమగుటకు వృద్ధిపొందుతున్నది (ఎఫెసీ 2:21). ప్రతి విశ్వాసి ఈ కట్టడంలో చక్కగా అమర్చబడుతున్నాడు. (1 పేతురు 2:5). వృద్ధిపొందుతున్నది అంటే ఈ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని అర్థం. తిరిగి జన్మించిన వారు సజీవమైన రాళ్ళుగా, సజీవమైన మందిరముగా వృద్ధిచెందుతున్నారు.

**సి) సంఘము ఒక మర్మము (3 అధ్యా) :**

ఎఫెసీ పత్రికలో సిద్ధాంతపరమైన భాగంలో ఇది చివరి అధ్యాయం. సంఘము ఒక మర్మము అనే విషయాన్ని అనేకులు అపార్థం చేసుకొంటున్నారు. మర్మము అంటే నిగూఢమైనదని అర్థం కాదు గాని, ఇంతకు పూర్వము, వెల్లడించబడనిది ప్రస్తుతం వెల్లడి చేయబడినదని అర్థం. మఫెట్ అనే బైబిలు పండితుడు దీనిని “దైవిక రహస్యం” అన్నాడు. ఈ దైవిక రహస్యాన్ని దేవుడు కొంతకాలం వరకు మరుగుపర్చాడు. ఇప్పుడు దానిని ప్రత్యక్ష పరుస్తున్నాడు.

**మర్మము యొక్క వివరణ (3:1-4) :** ఆ మర్మం 6,11 వచనాలలో చెప్పబడింది. పౌలు అన్యజనులకు సువార్త ప్రకటించడానికి దేవుని ద్వారా పంపించబడ్డాడు. అతని సేవ ప్రత్యేకమైనది (గలతీ. 2:7). సువార్తలో మార్పు లేదు అందరూ ఒక్కటే సువార్తను ప్రకటించారు. అయితే ప్రకటించబడిన ప్రజలు వేరు. పౌలు పరిసయ్యునిగా పాతనిబంధనకు కట్టుబడిన వాడైనా అన్యజనుల మధ్యకు మిషనరీగా పంపించబడ్డాడు. అలా అని దేవుడు రక్షణ కొరకైన పద్ధతిని మార్చలేదు. రక్షణ రక్తప్రోక్షణ ద్వారానే సాధ్యం. ఆ బల్యర్పణ క్రీస్తునే సూచిస్తున్నది. ఈ మర్మము పాతనిబంధనలో ప్రత్యక్షపరచబడలేదు గనుక మానవులకు మరుగుగా ఉండినది. ఇప్పుడు క్రొత్త నిబంధనలో స్పష్టంగా ప్రత్యక్షపరచబడింది (రోమా 16:25-27; కొలస్సీ. 1.27).

**మర్మము యొక్క నిర్వచనం (3:5-13) :** ఈ భాగంలో పౌలు, సంఘమును గూర్చిన మర్మము తనకు ఒక్కనికే బయలుపరచబడలేదని, ఆత్మమూలముగా దేవుని పరిశుద్ధులగు అపొస్తలులకును, ప్రవక్తలకును బయలుపరచబడిందని స్పష్టంగా చెప్పాడు. అయితే ఈ

మర్మం యొక్క ఖచ్చితమైన నిర్వచనం ఏంటి? ఈ భాగంలో మర్మము అన్యుల రక్షణను గూర్చిన విషయమా? అన్యజనులు రక్షణ పొందుతారని పాతనిబంధనలో పలుచోట్ల వ్రాయబడింది (యెషయా 11:10; 42:6,7; జెకర్యా 2:11; మలాకీ 1:11). గనుక ఇది మర్మముగా ఉంచబడలేదు. అయితే పౌలు చెప్పిన ఈ మర్మము ఏంటి? అన్యజనులు ఇశ్రాయేలీయులవలెనే, సువార్తను విశ్వసించుట ద్వారా యేసుక్రీస్తు శరీరమైన సంఘములోనికి చేర్చబడతారు, గనుక వారు యూదులతో పాటు సమానవారసులు అన్నదే ఆ మర్మము. వారు కూడా ఒకే శరీరమందలి సాటి అవయవాలు మరియు వాగ్దానములో పాలివారు.

**2. రెండవ భాగం - ఆచరణాత్మకమైన విషయాలు (4-6 అధ్యా) :**

**ఎ) సంఘం ఒక నూతన పురుషుడు (4 అధ్యా) :**

క్రీస్తునందు విశ్వాసముంచిన వారందరిని ఆయన ఒక నూతన పురుషునిగా సృష్టించాడని 2వ అధ్యాయం 15వ వచనంలో చూసాం. ఈ నూతన పురుషుని గూర్చి అనగా సంఘం యొక్క ప్రవర్తన మరియు విశ్వాసి యొక్క పిలుపును గూర్చి, ఈ భూలోకంలో విశ్వాసి యొక్క నడకను గూర్చి ఈ రెండవ భాగంలో వ్రాయబడింది. క్రీస్తునందు విశ్వాసముంచినవారు అనగా సంఘము క్రీస్తుతో కూడా ఆయన కుడిపార్శ్వమందు పరలోకమందు ఆసీనమై యున్నప్పటికిని, ఈ భూమి మీద జీవిస్తున్నది. కనుక పరలోక సంబంధులుగా ఈ లోకంలో జీవించే విధానం, చివరి 3 అధ్యాయాలలో పేర్కొనబడింది.

**నూతన పురుషుని ప్రదర్శన (4:1-6) :** నూతన పురుషునిగా చేయబడిన సంఘం పిలువబడిన పిలుపునకు తగినట్లుగా నడుచుకోవాలి (ఎఫెసీ. 4:3). ఫిలిప్పీ 1:27 లో సువార్తకు తగినట్లుగా నడచుకోవాలని చెప్పబడింది. అనగా మన జీవిత విధానమే క్రీస్తు సువార్తగా ఉండాలని అర్థం (కొలస్సీ. 1:10; 1 థెస్స. 2:11 కూడ చదవండి). మన జీవితాన్ని పరిశీలించేవారు ఎంతో మంది ఉన్నారని మర్చిపోవద్దు సుమా! విశ్వాసిగా ఈ లోకంలో నిన్ను నీవు ఎలా ప్రదర్శించుకొంటున్నావు?

**నూతన పురుషుడు నియంత్రించవలసినవి (4:7-16) :** సంఘము కొన్ని విషయాలను నియంత్రించుకోవాలని ఈ భాగం తెలుపుతుంది. సంఘము ఎప్పుడూ పసిబిడ్డలాగ ఉండకూడదని, అది ఎదుగుతూ కొన్ని విషయాలను నియంత్రించుకోవడంలో అభివృద్ధి చెందాలని పౌలు చెప్తున్నాడు (ఎఫెసీ. 4:14-16). పిల్లలు చెప్పే కొన్ని విషయాలను పెద్దలు చెప్పరు. పిల్లలు ప్రవర్తించినట్లు పెద్దలు ప్రవర్తించరు (1 కొరింథీ 13:11). సంఘము పసిబిడ్డగానే ఉండక పరిపక్వదశలోనికి, అనగా క్రీస్తునకు కలిగిన సంపూర్ణతలోనికి ఎదగాలని దేవుడు కోరుతున్నాడు, అలా ఎదగడానికి తగిన కృపను అనుగ్రహిస్తున్నాడు.

**నూతన పురుషుడు నిషేధించవలసినవి (4:17-32) :** నూతన పురుషునికి కొన్ని ఆత్మీయ నిషేధాలున్నవి. ఇవి మానవులు కల్పించిన నిషేధాలకు భిన్నమైనవి. సాధారణంగా ఇలా

చెయ్యి అని చెప్పిన విషయాలను సంతోషంగా స్వీకరిస్తాము కాని చెయ్యవద్దు అని చెప్పబడిన వాటిని ఇష్టపడము. దేవుని వాక్యం నూతన పురుషుడు చెయ్యకూడని వాటిని గూర్చి చెప్తున్నది. ఏదేనుతోటలో దేవుడు ఇచ్చిన ఆజ్ఞలోను (ఆది.కా. 2:17) పది ఆజ్ఞలలోను చెయ్యవద్దు అనే మాట కనిపిస్తున్నది. అలాగే పౌలు కొన్ని విషయాలను చెయ్యవద్దని చెప్తున్నాడు. ఈ భాగంలో ప్రధానంగా నిషేధించబడిన విషయమేమనగా "కాబట్టి అన్యజనులు నడుచుకొనునట్లు మీరిక మీదట నడుచుకొనవలదు" (ఎఫెసీ. 4:17).

అన్యజనులు ఎలా నడుచుకొంటారు? (ఎఫెసీ. 4:18,19) వారు అంధకారమైన మనస్సుగలవారు. పాపము ద్వారా తృప్తిచెందవచ్చునన్నదే వారి వ్యర్థమైన ఊహ. ఈ ఊహ నైతిక విలువలను వారి దృష్టికి మరుగుచేస్తుంది. అదే అంధకారమైన మనస్సు. అన్యజనులు దేవుని వలన కలుగు జీవములో నుండి వేరు పరచబడినవారు. వారు పాపముల వలన చచ్చిన స్థితిలో ఉన్నారు. గనుక దేవునితో సంబంధంలేనివారు. ఆయనతో సంబంధం కలిగి ఉండుటలోని అధిక్యత ఏంటో తెలియని అజ్ఞానులు. కనుక అపవిత్రతను అత్యాశతో జరిగిస్తారు. కాని విశ్వాసులు ప్రాచీన స్వభావమును వదలుకొని, చిత్తవృత్తియందు నూతన పరచబడినవారై దేవుని పోలికగా సృష్టించబడిన నవీన స్వభావమును ధరించుకోవాలి (ఎఫెసీ. 4:22-24). అలా నవీన స్వభావమును ధరించుకొన్నవారు నిషేధించవలసిన వాటిని గూర్చి ఎఫెసీ. 4:25-32 వరకు వ్రాయబడింది.

**బి) సంఘం ఒక కాబోయే వధువు (5 అధ్యా) :**

ఈ అధ్యాయం భవిష్యత్తును గూర్చి ప్రాధాన్యతనిస్తుంది. సంఘము ఒక వధువు కాబోతున్నది. ప్రస్తుతం సంఘము వధువుగా లేదు. క్రీస్తుతో ప్రధానము మాత్రము చేయబడింది (2 కొరింథీ. 11.2). సంఘము క్రీస్తుతో ఎత్తబడిన తరువాత వధువు అవుతుంది (ప్రకటన 21:2,9).

**సంఘము యొక్క ప్రధానము (5:1-17) :** ఈ భాగంలో క్రీస్తుతో ప్రధానం చేయబడిన సంఘము, వధువుగా ఆయన ద్వారా స్వీకరించబడడానికి సిద్ధపడాల్సిన విధానమును గూర్చి వ్రాయబడింది. క్రీస్తు సంఘమును ప్రేమించి తన్నుతాను సమర్పించుకొన్నాడు (ఎఫెసీ. 5:1,2). అలాంటి ప్రేమనే విశ్వాసి కలిగి ఉండాలి. ఈ ఫలమును పరిశుద్ధాత్మనే విశ్వాసిలో ఉత్పత్తి చేస్తాడు (గలతీ. 5:22). ఆయన పిల్లలము అని చెప్పుకొనే వారు నిష్ఫలమైన అంధకార క్రియలలో పాలివారైయుండక వెలుగు సంబంధులవలె నడచుకోవాలి (ఎఫెసీ 5:3-14; 1 యోహాను 1:7). పౌలు మరో విషయాన్ని జ్ఞాపకం చేస్తున్నాడు. విశ్వాసి జ్ఞానముతో నడచుకోవాలి (ఎఫెసీ. 5:5-17) అనగా అత్యవసరమైన దానిని గ్రహించాలి మరియు దేవుని కొరకు జీవించాలి. ఒక రైలు, పట్టాలపైననే నడిచినట్లు విశ్వాసినడకలో అతని లక్ష్యమంతా దేవుని చిత్తమనే పట్టాలపై నిలిచివుండాలి. అతడు క్రీస్తుకు చెందినవాడని

ప్రత్యక్షపరచుకొంటు ఈ లోకంలో నడచుకోవాలి. నీవు క్రైస్తవుడవా? అని ప్రశ్నించనక్కరలేదు. అతడు దేవుని బిడ్డ అని అతని ప్రవర్తననే సాక్ష్యమిస్తుంది.

**సంఘము యొక్క అనుభవము (5:18-24) :** ప్రతి విశ్వాసికి తప్పకుండా ఒక అనుభవం ఉండాలి. ఆ అనుభవం ఏంటో 18-21 వచనాలలో వ్రాయబడింది. ఇక్కడ పౌలు త్రాగుబోతుతనమును గూర్చి చెప్పడంలేదు. కాని ఒక ఆత్మీయ సత్యాన్ని మద్యముతో పోల్చిచెప్తున్నాడు. దేవుని బిడ్డలు పరిశుద్ధాత్మ పూర్ణులైయుండాలి. దీనినే ఆత్మచేత నింపబడుట అంటాము. అంటే అర్థం ఏంటి? మద్యమును త్రాగిన వ్యక్తి మద్యముతో నింపబడి ఉంటాడు. మద్యము అతన్ని వశపరచుకొంటుంది. ఆలాగే విశ్వాసిని పరిశుద్ధాత్ముడు తన వశములో ఉంచుకొంటాడు. ఇది అధికమైన ఉద్వేగాన్ని కలుగజేయదు గాని, విశ్వాసిగా సమర్ధవంతమైన జీవితాన్ని కొనసాగించడానికి, మరియు దేవుని కార్యాలను నెరవేర్చడానికి పురికొల్పుతుంది. మనం ఆత్మచేత నింపబడ్డాము అంటే ఆత్మ స్వాధీనంలో ఉన్నామని అర్థం. ఆత్మపూర్ణమైన వ్యక్తే జ్ఞానముగా నడచుకోగలడు (గలతీ 5:22,23). క్రీస్తుతో నడవడానికి, క్రీస్తు కొరకు జీవించడానికి ప్రతి విశ్వాసి, ప్రతి దినం ఆత్మతో నింపబడాలి.

**సంఘము నుండి ఆశించినది (5:25-33) :** సంఘము ఎలా ఉండాలని దేవుడు కోరుతున్నాడు? ఈ భాగంలో సంఘమును గూర్చిన భూత భవిష్యత్ వర్తమాన కాలస్థితులు పేర్కొనబడ్డాయి (ఎఫెసీ.5:25-29). "క్రీస్తు సంఘమును ప్రేమించి... దాని కొరకు తన్ను తాను అప్పగించుకొనెను" అన్నది భూత (గత) కాలానికి సంబంధించినది. "వాక్యముతో ఉదక స్నానము చేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధపర్చడం" వర్తమాన (ప్రస్తుత) కాలానికి సంబంధించినది. "ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని" అన్నది భవిష్యత్తుకు సంబంధించినది. క్రీస్తు సంఘమును నిష్కళంకమైనదిగా, నిర్దోషమైనదిగా ఉండాలని కోరుతున్నాడు. సంఘము ఏ విధంగా అలంకరించబడాలని ఆశిస్తున్నాడో ప్రకటన 19:6-8 వచనాలలో తెలుపబడింది.

### సి) సంఘం ఒక సైనికుడు (6 అధ్యా) :

విశ్వాసికి ఇహలోక జీవితంలో శత్రువు ఉన్నాడు. ఈ శత్రువు వెలుపలివాడు కాదుగాని క్రైస్తవ్యంలోనే ఉన్నాడు కనుక క్రైస్తవుడు క్రీస్తు కొరకు మంచి సైనికునిలా ఉండాలి. 6వ అధ్యాయం ప్రారంభంలోనే పిల్లలు, తల్లిదండ్రులు, దాసులు మరియు యజమానులకు సూచనలు ఇవ్వబడ్డాయి. ఇవేవి సైనికుని జీవితానికి సంబంధించినవి కావు. అయితే సైనికుని యొక్క జీవితం, కుటుంబంలో ఒక బాలునిగా ఉన్నప్పుడే ప్రారంభమౌతుంది గనుక ఈ సూచనలు కూడా అవసరమైనవే.

### సైనికుని సంబంధాలు (6:1-9) :

1. **పిల్లలు - (ఎఫెసీ.6:1,2) :** పిల్లలు తల్లిదండ్రులకు లోబడడం దేవుని చిత్తం, కనుక ఇది ధర్మమే. పిల్లలు తల్లిదండ్రులకు ఎందుకు విధేయులుగా ఉండాలి.

- ఇది దేవుని ఆజ్ఞ (ఎఫెసీ. 6:2,3; నిర్గ.కా. 20:12).
- వారు నీకు జన్మనిచ్చినవారు. నిన్ను సృష్టించిన దేవుని పట్ల ఎంత కృతజ్ఞత కలిగి ఉన్నావో, నిన్ను కనిన తల్లిదండ్రుల పట్ల అంతే కృతజ్ఞత కలిగి వుండాలి.
- వారు దేవుని పక్షంగా మీ బాధ్యతను వహించినవారు. దేవుడు తండ్రిగా, తల్లిగా తన ప్రేమను వ్యక్తం చేయడానికి మీ పట్ల తన బాధ్యతను నిర్వర్తించడానికి మీ తల్లిదండ్రులను తన స్థానంలో ఉంచాడు.
- మీరు భవిష్యత్తులో తల్లిదండ్రులుగా ఉండబోతున్నారు. మీరు తల్లిదండ్రులను సన్మానిస్తే, మీ పిల్లలు మిమ్మల్ని సన్మానిస్తారు.

2. **తల్లిదండ్రులు (ఎఫెసీ. 6:4) :** తండ్రులారా! అనే మాట పురుషుని బాధ్యతను ఎక్కువగా జ్ఞాపకం చేసినా, తల్లిదండ్రులిద్దరూ పిల్లల పెంపకంలో పాత్ర వహించాలి. పిల్లలను ప్రభువు యొక్క శిక్షలో, అనగా క్రమశిక్షణలో మరియు బోధలో పెంచాలి. పిల్లలకు కోపము రేపవద్దు. అలా అని శిక్షించవద్దని కాదు, పిల్లలకు శిక్ష తప్పనిసరిగా అవసరం (సామె. 13:24; 19:18; 22:15; 23:13,14; 29:15,17). తల్లిదండ్రులారా! ఒక విషయాన్ని మర్చిపోవద్దు. పిల్లలను ఆత్మీయంగా మలచడం మరియు క్రమశిక్షణ నేర్పడం రెండు కూడ ప్రభువును బట్టే చెయ్యాలి.

3. **భార్యభర్తలు :** విధేయత అన్నది మొదట భార్యాభర్తల సంబంధంలో ప్రారంభించబడాలని 5:21-27లో పౌలు వివరించాడు. క్రైస్తవ కుటుంబంలోని సంబంధాలు క్రీస్తునకు సంఘమునకు గల సంబంధంలా ఉండాలని పౌలు చెప్తున్నాడు. అయితే ఈ రెండు సంబంధాలలో వ్యత్యాసాన్ని కూడ మనం గమనించాలి. క్రీస్తు సంఘానికి శిరస్సు మాత్రమే కాదు, శరీరానికి రక్షకుడు కూడ. భర్త భార్యకు రక్షకుడు కాదు, అయినా భార్య తన భర్తకు మరియు క్రీస్తుకు లోబడాలి. 5,6 అధ్యాయాలలో విధేయత అనే మాట 5 సార్లు కనిపిస్తుంది.
   - విశ్వాసులు ఒకరికొకరు లోబడాలి – ఎఫెసీ. 5:21.
   - స్త్రీలు తమ సొంత పురుషులకు లోబడాలి – ఎఫెసీ. 5:22.
   - పురుషులు క్రీస్తుకు లోబడాలి – ఎఫెసీ. 5:23; 2 కొరింథీ. 11.3
   - పిల్లలు తల్లిదండ్రులకు లోబడాలి – ఎఫెసీ. 6:1.
   - దాసులు యజమానులకు లోబడాలి – ఎఫెసీ. 6:5.

   స్త్రీలు పురుషులకు లోబడుట, పురుషులు క్రీస్తుకు లోబడుటను గూర్చి ఉపయోగించబడిన గ్రీకు పదమునకు అర్థం ప్రేమకు స్పందించుట లేక ప్రేమించేవారి అధికారాన్ని అంగీకరించుట. కనుక భార్య విధేయత చూపించడానికి, భర్త ప్రేమ స్ఫూర్తిగా ఉండాలి. క్రీస్తు మొదట సంఘమును ప్రేమించి దాని కొరకు తన్నుతాను అర్పించుకొన్నాడు గనుక పురుషుడు కూడా స్త్రీని అలా ప్రేమించి ఆమె తన అధికారానికి లోబడేలా వశరచుకోవాలని కోరుతున్నాడు. ఇది పరస్పరం జరిగించాల్సిన క్రియ.

4. **దాసులారా! యజమానులారా! :** మన సమాజంలో మరో ప్రాముఖ్యమైన సంబంధము దాసులకు యజమానులకు మధ్య ఉండేది. వీరిరువురి మధ్య సరైన సహకారం ఉన్నప్పుడే పని సజావుగా జరుగుతుంది. ఈ భాగంలో పౌలు విశ్వాసులైన దాసులకు, యజమానులకు సూచనలిస్తున్నాడని గమనించాలి. వీరిద్దరూ పాప దాస్యం నుండి విడిపించబడిన వారే గనుక వీరిద్దరు కూడ క్రీస్తుకు దాసులు. వీరిద్దరికి క్రీస్తుతోగల సంబంధం ఎలా ఉన్నదో ఆలాగే వారిద్దరి మధ్యగల సంబంధం ఉండాలని పౌలు స్పష్టం చేస్తున్నాడు. దాసులు గమనించాల్సినదేమనగా, వారు క్రీస్తుకు లోబడినట్లు తమ యజమానులకు లోబడాలి. క్రీస్తుకు చేసినట్లే తమ యజమానులకు సేవ చేయాలి. క్రీస్తును గౌరవించినట్లే యజమానిని గౌరవించాలి. ఇక్కడ ఒక ముఖ్య విషయం జ్ఞాపకముంచుకోవాలి. ఎఫెసీ. 6:5 లో "శరీర విషయమై మీ యజమానులకు విధేయులై యుండుడి" అని వ్రాయబడింది. అనగా, వారి శరీరాలే యజమాని దాస్యంలో ఉన్నవి గాని వారి ఆత్మలు కావు.

ఇక యజమానులు గమనించాల్సినదేమంటే, మీ దాసులకు మీరు యజమానులు కావచ్చును గాని మీరు కూడా క్రీస్తుకు దాసులని, మీపై కూడ ఒక యజమాని ఉన్నాడని గుర్తుంచుకొనండి. మీ యజమానియైన దేవుడు పక్షపాతికాడు గనుక మీరు కూడ మీ దాసుల పట్ల నిష్పక్షపాతంతో వ్యవహరించాలి. వారిని బెదిరించవద్దు. మీ ఆధిక్యతను అదనుగా చేసుకొని వారిని బాధించవద్దు. క్రీస్తులో అందరూ సహోదరులే. పౌలు, ఒనేసీమును గూర్చి ఈ మాటలే ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక 15,16 వచనాలలో వ్రాసాడు. క్రైస్తవ్యం క్రియాపూర్వకమైనది. ప్రతి విశ్వాసి కుటుంబంలో, సంఘంలో సమాజంలో సంబంధాలను కాపాడుకోవాలి, వాటి అభివృద్ధికి తోడ్పడాలి.

**సైనికుని యొక్క శత్రువు (6:10-12) :** క్రీస్తు సంఘము సైనికునికి పోల్చబడిందని ఇంతకు ముందే చూసాము. అయితే లోకంలో సైనికునిగా ఉన్న విశ్వాసికి శత్రువు ఉన్నాడు. ఆ శత్రువును గూర్చి మనం తెలుసుకోవడం అవసరం. సైనికుడు పోరాడాలి. విశ్వాసి పోట్లాడవచ్చా? అని అనేకులు ఈ విషయాన్ని అపార్థం చేసుకొంటారు, గాని ఈ పోరాటం శరీర సంబంధమైనది కాదని కేవలం ఆత్మ సంబంధమైనదని గమనించాలి. మనం పరలోకానికి సంబంధించినవారమైనా ఈ భూలోకంలోనే జీవిస్తున్నాం, ఈ లోకంలో మనకు కొన్ని బాధ్యతలున్నాయి గనుక వాటిలో మనం విజయ వంతులు కావాలి. ఈ విజయం మన ఆత్మీయ విజయంపై ఆధారపడి ఉంటుంది. అందుకు, ఈ పోరాటం ఎలా ఎక్కడ ప్రారంభమౌతుందో గుర్తించాలి.

"మనం పోరాడునది శరీరులతో కాదు గాని ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకారసంబంధులగు లోకనాధులతోను, ఆకాశ మండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము" (ఎఫెసీ. 6:12). మన చుట్టు దురాత్మల సమూహాలు

ఆవరించి ఉన్నవి. లోకంలో ఈ శక్తులు సంఘానికి, విశ్వాసికి, మరియు దేవునికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయి.

సిద్ధపర్చబడిన ఈ సమూహాల ద్వారా సాతాను ఈ లోకంలో ప్రస్తుతం పని జరిగిస్తూనే ఉన్నాడు. ఈనాడు లోకంలోని ప్రధాన సమస్యలన్నిటికి కారణం వాడే. అయితే యుద్ధం ఎక్కడ జరుగుతుంది? సాతాను యొక్క యుద్ధభూమి సంఘము. సంఘంలో ఆర్థికలేమి, శ్రమలు మొదలైనవి సాతానుదాడి కాదుగాని, సంఘమును ఆత్మీయదృష్టి కోల్పోయేలా చేయడమే సాతాను దాడి. సంఘములోని సభ్యులందరూ క్రీస్తులో ఎదుగుతున్నారా? దేవుని వాక్యం సరిగా బోధించబడుతున్నదా? విశ్వాసులలో ప్రేమ, సహకారం ఉన్నాయా? ఒకరిపై ఒకరు చాడీలు చెప్పుకోవడం తగ్గిందా? ఎక్కడ విమర్శలు, కక్షలు, ద్వేషాలుంటాయో అక్కడ దేవుని ఆత్మపనిచేయదు. క్రీస్తును విశ్వసించిన వారి సంఖ్యను గూర్చి సంఘములలో సగర్వంగా చెప్పుకోవచ్చును. కాని ఒకటి లేక రెండు సంవత్సరాలకు వారిలో సగం మంది కూడా ఉండరు. కారణం వారు పలు సిద్ధాంతాలచే ప్రభావితం చేయబడి విశ్వాస భ్రష్టులౌతున్నారు. సంఘం నుండి తొలగిపోతున్నారు. ఇది శత్రువైన సాతాను, మరియు వారి అనుచరులైన దురాత్మల సమూహం యొక్క పని.

**సైనికుని రక్షణ (ఎఫెసీ.6:13-18) :** సైనికునివలె ఉన్న సంఘము శత్రువైన సాతాను దాడిని ఎదుర్కొనేందుకు అవసరమైన ఆయుధాలను గూర్చి ఈ భాగంలో పేర్కొనబడింది. ఆ ఆయుధాలు ఏవో, వాటి ఆధ్యాత్మిక భావం ఏంటో తెలిసికొందాం.

**సత్యమనుదట్టి :** ఇది నడుముకు ధరించాల్సిన ఆయుధం, బలంగా, చురుకుగా పని చెయ్యాలంటె నడుముకు దట్టి అవసరం (సామె.31:17; యోహాను 13:4). సైనికుని నడుముకు నడికట్టు లేకుంటే వస్త్రాలు వదులై యుద్ధం చెయ్యడానికి అనానుకూలత ఏర్పడుతుంది. సాతాను అబద్దాలతో మనపై దాడి చేస్తాడు. అబద్ధము వాని నుండే పుట్టింది (యోహాను 8:44). కొన్నిసార్లువాడు చెప్పే అబద్దాలు నిజమే అనిపిస్తాయి. వాడువెయ్యి నిజాలు చెప్పి ఒకే అబద్ధంతో మనల్ని పడేస్తాడు. ఆత్మీయ జీవితం వంగిపోకుండ ఉండాలంటే సత్యమును నడికట్టుగా ధరించి అబద్దాలను జయించాలి (ఎఫెసీ.4:15,25). దేవుని వాక్యమే సత్యము (యోహాను 17:17). ఈ సత్యము అబద్ధబోధలను గుర్తించడానికి సహాయపడుతుంది.

**నీతియను మైమరవు :** ఇది సైనికుని కవచంలో ఛాతీని కప్పే భాగం. విశ్వాసికి యేసుప్రభువే నీతి అని బైబిలు చెప్తుంది (I కొరింథీ 1:31). ఆయనను అంగీకరించిన వారు నీతిని జరిగిస్తారు (1 యోహాను 2:29). కనుక ఈ ఆయుధం విశ్వాసి తన జీవితంలో ఆచరణాత్మకంగా కలిగి ఉండవలసిన నీతిని గూర్చి తెలుపుతున్నదని గ్రహించవచ్చును.

మన స్వనీతి అనే మురికి గుడ్డలు మైమరువుగా ఉండలేవు గాని దేవునితో సరిగా ఉన్న హృదయం, మనస్సాక్షి కలిగి ఉండాలని అర్థం. తన్నుతాను శత్రువు నుండి కాపాడుకోవలసిన విశ్వాసి దోషారోపణ చేయని హృదయాన్ని మనస్సాక్షిని కలిగి ఉండాలి.

**సమాధాన సువార్త వలనైన సిద్ధమనస్సును జోడు :** చక్కగా నిలబడడానికి జోళ్ళు అవసరం. కనుక జోళ్ళు ఆధ్యాత్మిక పునాదిని సూచిస్తున్నాయి. క్రీస్తు అనే పునాదిపై విశ్వాసి స్థిరంగా ఉండాలి. ఇక్కడ చెప్పబడిన జోళ్ళు సువార్తవలననైన సిద్ధమనస్సు అనే జోళ్ళు. విశ్వాసి జీవితం సువార్త అనే పునాదిపై కట్టబడినపుడు సువార్త ప్రకటించాలన్న సిద్ధమనస్సు కలుగుతుంది. ఆ పునాదిని గూర్చి హెబ్రీ. 6:1,2లో వ్రాయబడింది. సమాధాన సువార్త వలనైన సిద్ధమనస్సనే జోళ్ళు వేసుకొన్నవారే సమాధాన సువార్తను ప్రకటించగలుగుతారు (యెషయా 52:7). లోకమును దేవునితో సమాధాన పరచే పరిచర్య చేయగలుగుతారు (2 కొరింతీ. 5:18,19).

**విశ్వాసమను డాలు :** ఇక్కడ ప్రస్తావించిన డాలు చాలా పెద్దది. సైనికుని కవచమునంతా కప్పుతుంది గనుక సంపూర్ణ భద్రతనిస్తుంది. సాతాను ప్రయోగించే అగ్నిబాణాలు ఎలా ఉంటాయి? సాతాను దేవుని వాక్యాన్ని విశ్వసించకుండ అనేక అనుమానాలు పుట్టిస్తాడు. ఆయన వాగ్దానాలను నెరవేర్చును గూర్చి అనుమానం కలిగిస్తాడు. శ్రమలు, సమస్యలు వచ్చినప్పుడు అసలు దేవుడున్నాడా? ఉంటే నన్ను ఎందుకు చూడడం లేదు? ఎందుకు సహాయం చేయడం లేదు అనే సందేహాలు పుట్టిస్తాడు. వీటన్నిటిని అడ్డుకోవాలంటే విశ్వాసమనే డాలు అవసరం. ఇద్దరు వ్యక్తులు ఇశ్రాయేలు దేశాన్ని సందర్శించారు. అందులో ఒక వ్యక్తి మరొక వ్యక్తిని 'ఒకవేళ ఇప్పుడున్న భూగర్భ శాస్త్రజ్ఞులు ఈ ప్రాంతాన్ని పరిశోధిస్తే, బైబిలులో చెప్పబడిన ఇశ్రాయేలు చరిత్ర అబద్ధం అని నిరూపించగల సాక్ష్యాధారాలు ఏమైన లభిస్తే నీవు ఏమి చేస్తావు?' అని ప్రశ్నించాడు. ఆ రెండవ వ్యక్తి యేసుక్రీస్తునందు విశ్వాసముంచినవాడు గనుక అతడు వెంటనే, విశ్వాసమనే డాలు పట్టుకొని దుష్టుని అగ్నిబాణాలను ఆర్పివేస్తాను అని జవాబిచ్చాడు. ఎంత చక్కని జవాబు! నీవు అలా చేయగలుగుతున్నావా?

**రక్షణయను శిరస్త్రాణము :** శిరస్త్రాణము అన్న మాటను బట్టే అది శిరస్సును కాపాడుతుందని అర్థమౌతుంది. ఇది మానవుని యొక్క మనస్సుకు అనగా మేధస్సుకు సంబంధించినది. దేవుని గూర్చి, సువార్తను గూర్చి అర్థం చేసుకోగల జ్ఞానాన్ని, ఆలోచనా శక్తిని దేవుడు మానవునికి ఇచ్చాడు. మానవుడు వివాదాస్పద మనస్సుతో ఆయనయందు విశ్వాసముంచాలని కోరడం లేదు.

కనుక ఇక్కడ శిరస్త్రాణము రక్షణను గూర్చిన నిశ్చయతను సూచిస్తున్నది. ఈ నిశ్చయత విశ్వాసిలో తన భవిష్యత్తు స్థితిని గూర్చిన నిరీక్షణను కలిగిస్తుంది. 1 థెస్స. 5:8లో పౌలు

"దీనిని రక్షణ నిరీక్షణయను శిరస్త్రాణము" అని సూచించాడు.

**దేవుని వాక్యమనే ఆత్మ ఖడ్గము :** ఇంతవరకు మనం చెప్పుకొన్న ఆయుధాలన్ని శత్రుబారి నుండి మనల్ని తప్పించుకోవడానికి సహాయపడేవే. ఇప్పుడు సాతానుపై మనం దాడి చేయడానికి ఉపయోగపడే ఆయుధాలను తెలిసికొందాం.

ఆధ్యాతికసంగ్రామంలో మనల్ని మనం కాపాడుకొంటూ, శత్రువును ఖండిచడానికి దేవుని వాక్యమనే ఆత్మఖడ్గము అవసరం (హెబ్రీ. 4:12). యేసుప్రభువు శోధించబడినప్పుడు సాతానుపై ఈ ఖడ్గాన్నే ప్రయోగించాడు. ఆయనే ఆ వాక్యము. యేసుప్రభువు నోటిలో రెండంచులు గల ఖడ్గం ఉన్నదని (ప్రక. 1:16) హార్‌మెగిద్దోను యుద్ధంలో ఆయన దానిచేత శత్రువును జయిస్తాడని (ప్రక. 19:21) వ్రాయబడింది. ఈనాడు మననోటిలో దేవుని వాక్యమనే వాడియైన ఖడ్గం ఉండడం అవసరం. అది ఎంతో శక్తివంతమైన ఆయుధం. రెండవ ఆయుధం ప్రార్థన (ఎఫెసీ. 6:18). ఆత్మవలన ప్రార్థించుట అంటే మన శత్రువు ఎవరో గుర్తించాక, వానిని జయించడానికి అవసరమైన ఆధ్యాత్మిక ఉపకరణాల కొరకు దేవుని ఆశ్రయించుట. ఇక్కడ పౌలు ప్రార్థనకు మరియు విజ్ఞాపనకుగల తేడాను స్పష్టంచేస్తున్నాడు. ప్రార్థన అంటే సాధారణంగా చేసేది. విజ్ఞాపన అంటే ఒక ప్రత్యేకమైన దాని కొరకు వేడుకొనుట, ఆత్మవలన చేసే ప్రార్థన శక్తివంతంగా ఉంటుంది.

**ముగింపు :**

1. **సైనికుని మాదిరి (6:19-22) :** ఈ పత్రిక చివరి భాగానికికొచ్చేసరికి పౌలు తన వ్యక్తిగత విషయాన్ని ప్రస్తావిస్తూ, తన కొరకు ప్రార్థించాలని కోరుతున్నాడు. పౌలు యేసుక్రీస్తు కొరకు మంచి సైనికునిగా జీవించాడు, ఎఫెసీ పత్రిక వ్రాసిన సమయంలో పౌలు రోమా పట్టణంలో ఖైదీగా ఉన్నాడు. అతని శరీరంలో భౌతికంగా ఓ ముల్లు ఉన్నది. అయితే పౌలు వాటి నిమిత్తం ప్రార్థించమని కోరడం లేదు గాని సువార్త మర్మాన్ని ధైర్యంగా ప్రకటించాలని ప్రార్థించమని వ్రాసాడు. పాతనిబంధనలో సువార్తమర్మముగా ఉండినది గాని, క్రొత్తనిబంధనలో "లేఖనముల ప్రకారం క్రీస్తు మన పాపముల నిమిత్తము మరణించాడని, పాతిపెట్టబడ్డాడని, మూడవ దినమున తిరిగి లేచాడని" స్పష్టంగా చెప్పబడింది. ఈ సువార్తనే పౌలు ప్రకటించాడు. క్రీస్తు నిమిత్తం నేను, బంధకాలలో ఉన్నానని పౌలు వ్రాసాడు. విశ్వాసుల ఆధ్యాత్మిక సంగ్రామాన్ని గూర్చి హెచ్చరించిన పౌలు ఆ సమయంలో తానే ఆ పోరాటాన్ని ఎదుర్కొంటున్నాడు. కాని సువార్తను ధైర్యంగా ప్రకటించడానికి ప్రార్థించాలని కోరుతున్నాడు. నేడు ఈ ప్రార్థన మనందరికీ అవసరమే!

2. **సైనికుని ఆశీర్వచనము (ఎఫెసీ. 6:23,24వ) :** "వృద్ధ సైనికులు వదలిపోతారు గాని మరణించరు" అని జనరల్ డగ్లస్ మాక్ ఆర్థర్ అన్నాడు. తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక

ముగింపులో పౌలు క్రీస్తు సైనికుని యొక్క మంచి లక్షణాన్ని మరియు అతడు పొందబోయే బహుమానాన్ని గూర్చి వ్రాసాడు. ఎఫెసీ పత్రిక ముగింపులో ఆ సంఘానికి వ్రాసిన వీడ్కోలు మాటలలో రెండు రకాలైన ఆశీర్వచనాల్ని చూడగలం.

“తండ్రియైన దేవుని నుండియు ప్రభువైన యేసుక్రీస్తు నుండియు, సమాధానమును విశ్వాసముతో కూడిన ప్రేమయును సహోదరులకు కలుగును గాక!”

“మన ప్రభువైన యేసుక్రీస్తును శాశ్వతమైన ప్రేమతో ప్రేమించు వారందరికిని కృప కలుగునుగాక!”

ఈ ఆశీర్వచనములో సువార్త సందేశంలోని సమాధానము, ప్రేమ, విశ్వాసము, కృప అనే గొప్ప మాటలున్నాయి. సమాధానము కలుగునుగాక! అన్నది సాధారణంగా యూదులు చెప్పే శుభాశీస్సులు. ఒక పాపి దేవుని సమాధానాన్ని కలిగివుండాలంటే మొదట దేవుని కృపను అనుభవించి ఉండాలి. ఇక ప్రేమ అనే పదం 23వ వచనంలో సహోదరుల పట్ల చూపించాల్సిన ప్రేమను, మరియు 24వ వచనంలో యేసుక్రీస్తుపట్ల విశ్వాసికున్న ప్రేమను గూర్చి చెప్తున్నది. విశ్వాసముతో కూడిన ప్రేమ అంటే ప్రేమను ఉత్పత్తి చేయగల క్రీస్తునందలి విశ్వాసము అని అర్థం. ఇవన్నీ తండ్రియైన దేవుని నుండియు, ప్రభువైన యేసుక్రీస్తు నుండియు కలుగుతాయి. కృప అనేమాట ఈ పత్రిక మూలపదం. ఎఫెసీ పత్రిక కృప అనే పదంతో ప్రారంభించబడి (1:2) కృప అనే అంశంతో కొనసాగించబడి (2:7,8) అదే మాటతో ముగించబడింది. ఈ కృపనే సంరక్షిస్తుంది గనుక ఈ మాట ఉపయోగించబడటం సబబుగానే ఉంటుంది.

ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసం ఉంచిన ప్రతి ఒక్కరికి కలిగిన గొప్ప గుర్తింపు, గొప్ప ఆధిక్యత, ప్రతి ఒక్కరి పట్ల ఆయన కలిగి ఉన్న గొప్ప ఉద్దేశం ఇది. ఈ పుస్తకం చదివిన ప్రతి ఒక్కరు దేవుని గొప్ప ఉద్దేశమును గ్రహించినవారై క్రీస్తును, జీవితాంతం తమ రక్షకుడుగా ప్రభువుగా, కలిగినవారై క్రీస్తు చిత్తమును నెరవేర్చేవారై క్రీస్తు నియమాలను పాటించే వారై క్రీస్తునే సంతోష పెట్టి, క్రీస్తుకు మహిమకరంగా జీవిస్తూ, క్రీస్తురాకడకు సంసిద్ధులై ఉండుటకు కృపగల ప్రభువు మా ప్రియ పాఠకులందరికీ సహాయం చేయునుగాక! ప్రభువు కృప ప్రియశ్రోతలందరికీ సదా తోడై ఉండునుగాక!

**TTB - Telugu - Study Outlines - Book of Ephesians**
Printed by : Premadhara, Trans World Radio - India, 12-1-334/17/3,
Lalapet, Secunderabad - 500 017. Ph : 040-27003011.

**FREE** MP3 DOWN LOAD - Log on to :
**www.radio882.com**